

అంగన్వాడీల సమ్మె ఉధృతం

నేడు కలెక్టరేట్ వద్ద మహాధర్నా - 22వ రోజుకు ఆందోళనలు



చాట్రాయిలో దున్నపోతుకు వినతిని అందిస్తున్న అంగన్వాడీలు

6లో..

లస్కర్లను.. పట్టించుకోరా..!

- 11 నెలల వేతనాలు పెండింగ్
- ఏడాదికి 10 నెలలే జీతాల చెల్లింపు
- సమాన పనికి సమవేతనం, ఉద్యోగ భద్రత కరువు
- రబీ సాగునీటి సరఫరాలో లస్కర్లదే ప్రధానపాత్ర
- నేరుగా సిఎంకు వినతులిచ్చినా ఫలితం శూన్యం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలో డెల్టాలోని వ్యవసాయరంగానికి సాగునీటి సరఫరాలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న లస్కర్లపట్ల ప్రభుత్వం అత్యంత దారుణంగా వ్యవహరిస్తోంది. ఎక్కడబడి పనిచేస్తున్నప్పటికీ కనీస వేతనాలనూ, ఉద్యోగ భద్రత లేకపోగా, వేతనాలు కూడా సకాలంలో అందించడం లేదు. దీంతో లస్కర్లు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని డెల్టా ప్రాంతంలో ప్రస్తుత రబీలో 8.96 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగుచేస్తున్నారు. ఖరీఫ్‌లో సైతం ఇదేస్థాయిలో పెద్దఎత్తున సాగుచేపట్టారు. ప్రతిఏటా ఇదేవిధంగా డెల్టా ఆయకట్టు పరిధిలో వ్యవసాయం చేస్తున్నారు. దీంతో ధవళేశ్వరం ఆనకట్ట ఆయకట్టు పరిధిలో నీటి సరఫరా సక్రమంగా సాగేందుకు కాలువలపై లస్కర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దశాబ్దాల కాలంగా వీరంతా కాలువలపై పనిచేస్తున్నారు. ధవళేశ్వరం సర్కిల్‌లోని తూర్పు, పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో 610 మంది లస్కర్లు కాలువలపై పనిచేస్తున్నారు. రబీలో ప్రతిఏటా నీటిఎద్దడి సమస్య వెంటాడుతోంది. ప్రస్తుత రబీలో సైతం రెండు జిల్లాలకు 91.35 టిఎంసిల సాగునీరు అవసరంకాగా 82.49 టిఎంసిల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. వంతులవారీ విధానంలో సాగునీరు అందిస్తే తప్ప రబీసాగుగట్టెక్కే పరిస్థితి ఉండదు. ప్రతిఏటా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. దీంతో సాగునీటి సరఫరాలో లస్కర్లది కీలకపాత్రగా మారింది. ఇంతముఖ్యమైన విధులు నిర్వహిస్తున్న లస్కర్ల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. లస్కర్లు ఏడాదిలో 12 నెలలు పనిచేయాల్సి ఉంటుంది. కానీ ఏప్రిల్, మే నెల వదిలేసి పదినెలలకు మాత్రమే వేతనాలు ఇస్తున్నారు. అదికూడా నెలకు రూ.10,500 మాత్రమే చెల్లిస్తున్నారు. ప్రస్తుత ధరలకు ఈ వేతనం ఏ విధంగా సరిపోతుందో ప్రభుత్వం చెపాల్సి ఉంది. ఈ వేతనం కూడా నెలల తరబడి పెండింగ్‌లోనే ఉంటున్నాయి.



2022-23 సంవత్సరానికి సంబంధించి డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి, మార్చినెలలకు సంబంధించి నాలుగునెలల వేతనాలు పెండింగ్ ఉన్నాయి. 2023-24 ఏడాదికి సంబంధించి జూన్ నుంచి డిసెంబర్ వరకూ ఏడునెలల బకాయిలు పెండింగ్ ఉంది. మొత్తం 11 నెలల వేతనబకాయిలు లస్కర్లకు ఇవ్వాల్సి ఉంది. నరసాపురం, భీమవరం సిఎం పర్యటనల్లో నేరుగా సిఎంకు వినతిపత్రాలిచ్చినప్పటికీ పెద్దగా ప్రయోజనం లేని పరిస్థితి నెలకొంది.

లస్కర్లకు ఉద్యోగ భద్రతేదీ?

సాగునీటి సరఫరాలో భాగంగా లస్కర్లు కాలువలపై పనిచేయాల్సి ఉంటుంది. ప్రతిరోజూ కిలో మీటర్ల మేర తిరగాలి. రాత్రిపూట గస్తీకాయాలి. దీంతో విషసర్పాల నుంచి నిత్యమూ ప్రమాదం పొంచిఉంటుంది. లస్కర్లకు ఉద్యోగ భద్రత అనేది లేకుండా పోయింది. ఏడాదిలో పదినెలలే వేతనాలిస్తూ దారుణంగా మోసం చేస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనమివ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, లస్కర్ల జీతాలు నేరుగా 'ఎపిసిఎఎస్ కార్పొరేషన్ ఫర్ అవుట్‌సోర్సింగ్' సర్వీసెస్ అనుసంధానం చేసి నేరుగా బ్యాంకు ఖాతాలకు జమచేయాలని లస్కర్లు కోరుతున్నారు. సిఎం స్థాయిలో వినతిపత్రాలిచ్చినప్పటికీ ఫలితం లేకపోవడంతో లస్కర్లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.



ఉరితాళ్లతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఉరితాళ్లతో సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెలో భాగంగా 14వ రోజు మంగళవారం స్థానిక కలెక్టరేట్ వద్ద మెడకు ఉరితాళ్లు బిగించుకుని నిరసన తెలియజేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జెఎసి నేతలు మాట్లాడుతూ విద్యాశాఖలో కీలకపాత్ర పోషిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు వారంరోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. సిఎం జగన్ పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తాననే హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు పిఆర్‌సి అమలు చేయకుండా నెలలతరబడి వేతనాలు విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న పార్ట్ టైం విధానాన్ని రద్దుచేసి ఫుల్ టైం కాంట్రాక్ట్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. తెలుగుదేశం పార్టీ ఏలూరు నియోజకవర్గ కన్వీనర్ బడేటి చంటి సమ్మె శిబిరాన్ని సందర్శించి సమగ్ర శిక్ష ఉద్యోగులకు మద్దతు ప్రకటించారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు వెంటనే అమలు చేయాలని, ముఖ్యంగా విద్యావ్యవస్థలో విలీనం చేసి, రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈసారి టిడిపి ఎన్నికల మేనిఫెస్టోలో సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లను ముందు స్థానంలో ఉంచి, న్యాయం కలుగచేస్తామని తెలిపారు. సమగ్ర శిక్ష జెఎసి నాయకులు వినోద్, రూస్వీ, భగవాన్, రాజు, రాధిక, కేశవరావు, సత్య, సందీప్, దిలీప్, అన్ని విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

రెండో విడత జగనన్న సురక్ష ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు



జిల్లాలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతంగా ప్రారంభమైందని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ తెలిపారు. తొలిరోజు నిర్వహించిన 13 వైద్య శిబిరాల్లో 4546 ఒపి నమోదైందన్నారు. ఇందులో 2153 మంది పురుషులు కాగా, 2393 మంది మహిళలున్నారన్నారు. మెరుగైన వైద్యం కోసం 30 మంది రోగులను పెద్ద ఆసుపత్రులకు వైద్యాధికారులు రిఫర్ చేశారన్నారు. తొలివిడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో జిల్లాలో పలు వైద్యశిబిరాలు నిర్వహించారన్నారు. వారికి వైద్య పరీక్షలు చేయడంతోపాటు మందులు ఉచితంగా అందజేశామన్నారు. అదే విధంగా రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో గతంలో పొందిన వైద్య సేవలకు అనుసంధానంగా వైద్య సేవలు లక్ష్యంగా నిర్దేశించామన్నారు. ఈనెల మూడో తేదీన జిల్లాలోని అర్బన్ ప్రాంతాలైన ఏలూరు నగరంలో రెండు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నూజివీడు, పట్టణాల్లో ఒక్కొక్కటి చొప్పున జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ ప్రాంతాల్లో మంగళ, శుక్రవారాల్లో రెండుసార్లు, పట్టణ ప్రాంతంలో ఒక్కసారి ఈ వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

సాంప్రదాయ క్రీడలకే ప్రాధాన్యతివ్వాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - ఏలూరు

సంక్రాంతి పండుగ రోజుల్లో సాంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె ఖజావలి అన్నారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో మంగళవారం కోడిపందేలు, జూదం, గుండాటల నియంత్రణపై ఏలూరు డివిజన్లలోని డివిజినల్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్‌డిఒ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడా కోడిపందేలు, జూదం, గుండాట జరగకుండా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకోసం మండల స్థాయి నిఘా బృందాలను ఏర్పాటు చేశామన్నారు. కోడిపందేలు, జూదం, గుండాటపై నిషేధ ఆజ్ఞలు అమల్లో ఉన్నాయని, ఆ ఆదేశాలు ఉల్లంఘించిన వారిపై, సహకరించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. కోడి పందేలు, జూదం, గుండాటలపై నిషేధ ఆజ్ఞలు అమల్లో ఉన్నాయని, సంక్రాంతి పండుగ రోజుల్లో సాంప్రదాయ క్రీడలు జరుపుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడైనా కోడి పందేలు, జూదం, గుండాటలకు పాల్పడేవ్యక్తుల గురించి, ప్రదేశాల గురించి సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత తహశీల్దార్‌కు, లేదా స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు గానీ గ్రామ రెవిన్యూ ఆఫీసర్‌కు లేదా పంచాయతీ కార్యదర్శికి తెలియజేయాలని, సమాచారం తెలిపిన వారి వివరములు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ నెహ్రూబాబు, ఏలూరు, నూజివీడు డిఎస్‌పిలు శ్రీనివాసరావు, అశోక్ కుమార్ గౌడ్, తహశీల్దార్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న నిరసన

జిల్లాలో కొనసాగిన సమ్మె - విధులు బహిష్కరించి ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవ చేసిన మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం అన్యాయమని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్(సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు అన్నారు. ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికుల సమ్మె ఎనిమిదో రోజు కార్మికులు అర్ధనగ్నంగా తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జాన్‌బాబు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు ప్రజానీకానికి ఎంతో విలువైన సేవలందిస్తున్నారని, తమప్రాణాలను ఫణంగాపెట్టి ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్నారని, పారిశుధ్యం, తాగునీరు, వీధిలైట్లు, భూగర్భ డ్రెయినేజీ, పార్కులు తదితర సేవలతో పట్టణ ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్నారన్నారు. ప్రభుత్వాలు, మున్సిపాలిటీలు స్వచ్ఛభారత్ అవార్డులు తీసుకుంటున్నాయంటే దానికి కారణం మున్సిపల్ కార్మికుల శ్రమ అని ఆయన తెలిపారు. అలాంటి మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల సిఎం జగన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. మున్సిపల్ కార్మికులకు 2019 ఎన్నికలకు ముందు జగన్ పాదయాత్రలో, అసెంబ్లీలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా వెంటనే పర్మినెంట్ చేయాలని లేదా సమాన పనికి సమాన వేతనమివ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలు లేవని, రిస్క్ అలవెన్స్, హెల్త్ అలవెన్స్ లేదని, నైపుణ్యం గల పనులు చేస్తున్నప్పటికీ అన్‌స్కిల్డ్ వేతనాలు చెల్లిస్తున్నారని, పారిశుధ్య కార్మికులకు కనీసం చెప్పులు, సబ్బులు, కొబ్బరి నూనెలు, యూనిఫారాలు లేవని పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికులు పనులు చేయడానికి అవసరమైన పనిముట్లు కూడా అందుబాటులో లేవని తెలిపారు. వీటన్నింటినీ తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి బంగారు వెంకటేశ్వర్లు, ఆముదాల ఏసురత్నం, పంతం చిన్ననాగరాజు, బండి రాజు, మహిళా కార్మిక నాయకులు మేతర పాప, బండి భవాని, నక్క భాగ్యలక్ష్మి, లావేటి లక్ష్మి, రమణమ్మ శివకొండ, లీలావతి, కాంతమ్మ నాయకత్వం వహించారు.




ఏలూరులో..



చింతలపూడిలో..

చింతలపూడి : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.సత్యనారాయణ అన్నారు. పట్టణంలో నగరచాయతీ వద్ద మున్సిపల్ కార్మికుల సమ్మె ఆరో రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంగన్వాడీల యూనియన్ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, పృథ్వి, పద్మ, కమలమ్మ పాల్గొన్నారు.

నూజివీడు రూరల్:నూజివీడు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికుల నిరవధిక సమ్మె మంగళవారానికి ఎనిమిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మిక నాయకురాలు జయలక్ష్మి మాట్లాడుతూ సిఎం జగన్ ఇచ్చిన హామీల మేరకు కార్మికులను తక్షణం పర్మినెంట్ చేయాలని, గ్రాడ్యుటీ, పెన్షన్, బీమా సౌకర్యాలు కల్పించాలన్నారు. సమస్యలు పరిష్కారమయ్యేవరకూ ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్ఆర్.హనుమాన్లు, జి.రాజు, ఆదిలక్ష్మి, పద్మజ్యోతి, లక్ష్మీకాంతం, రమాదేవి పాల్గొన్నారు.



నూజివీడులో..

కలెక్టరేట్ వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యాన

నేడు12 గంటల ధర్నా

పెండింగ్ బకాయిలు, ఒపిఎస్ అమలు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల మూడో తేదీ ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం తొమ్మిది గంటల వరకూ 12 గంటల పాటు కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించనున్నట్లు యుటిఎఫ్ జిల్లాకార్యదర్శి ఆర్.రవికుమార్, అధ్యక్షులు షేక్ ముస్తాఫా ఆలీ తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అందుకు సంబంధించిన వివరాలను వారు వెల్లడించారు. సిఎం జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలిచ్చారన్నారు. ఒకటోతేదీన జీతాలు చెల్లిస్తామని, డిఎ సొమ్ములు సకాలంలో ఇస్తామని, సిపిఎస్ రద్దుచేసి ఒపిఎస్ అమలు చేస్తామంటూ అనేక హామీలిచ్చారన్నారు. అధికారంలోకొచ్చి ఐదేళ్లు పూర్తవుతున్నా ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. పదోతేదీ వచ్చినా జీతాలు అందని పరిస్థితి ఉందన్నారు. అప్పులు తెస్తే తప్ప ఉద్యోగులకు వేతనాలిచ్చే పరిస్థితి లేకుండా పోయిందని అధికారులు చెబుతున్నారన్నారు. పిఆర్‌సి అమలుకు ముందు ఉద్యోగ ఉపాధ్యాయులకు రూ.7,382కోట్ల బకాయిలుండగా పిఆర్‌సి తర్వాత రూ.4584 కోట్లు బకాయిలున్నాయన్నారు. పిఎఫ్ రుణాల కోసం రూ.వెయ్యి కోట్లకు సంబంధించిన దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. ఎపిజిఎల్ రుణాల దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. సరెండర్ లీవులు, డిఎ ఏరియర్స్ కింద ఉద్యోగ, ఉపాధ్యాయులకు మొత్తం రూ.1896 కోట్లు బకాయిందన్నారు. గతేడాది ఆగస్టులో జరిగిన సమావేశంలో సెప్టెంబర్‌లో బకాయిలు చెల్లిస్తామని చెప్పినా ఇప్పటికీ లేదన్నారు. ప్రభుత్వం దిగిరాకపోతే తొమ్మిది, పది తేదీల్లో రాష్ట్రకేంద్రంలో 36 గంటల ధర్నా ఉంటుందన్నారు. జనవరి 28న రాష్ట్రస్థాయిలో పెద్దఎత్తున సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దశలవారీ పోరాటాలకు యుటిఎఫ్ రాష్ట్ర కేంద్రంలో ఇప్పటికే పిలుపు ఇచ్చిందన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.వి. నరసింహారావు, రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిని, జిల్లా కోశాధికారి జిఎన్.రంగమోహన్, జిల్లాకార్యదర్శి ఈడే శివశంకర్, జిల్లాకార్యవర్గ సభ్యులు కెవి.అప్పారావు, పట్టణ కార్యదర్శి జొన్నకూటి రాజారావు, నాయకులు పాల్గొన్నారు.

ఏలూరులో నేడు 144 సెక్షన్ అమలు

కలెక్టరేట్ వద్ద అంగన్వాడీల మహాధర్నా నేపథ్యంలో చర్యలు

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు నగరంలో 144 సెక్షన్ విధిస్తూ తహశీల్దార్ బి.సోమశేఖరరావు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈనెల మూడో తేదీన అంగన్వాడీల కలెక్టరేట్ ముట్టడికి పిలుపు ఇచ్చిన నేపథ్యంలో మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం రాత్రి 11 గంటల వరకూ ఈ 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. నగరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉండటానికి ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తహశీల్దార్ తెలిపారు.

5 నుంచి జన్ భాగీదరి

19న విజయవాడలో అంబేద్కర్ విగ్రహావిష్కరణకు నాందిగా పలుకార్యక్రమాలు

జిల్లావ్యాప్తంగా నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

విజయవాడలో ఈనెల 19వ తేదీన అంబేద్కర్ విగ్రహావిష్కరణకు నాందిగా ఏలూరు జిల్లాలో ఈనెల ఐదో తేదీ నుంచి 19వ తేదీ వరకూ నిర్వహించే జన్ భాగీదరి కార్యక్రమం విజయవంతానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జన్ భాగీదరి కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విజయవాడలో ఈనెల 19వ తేదీన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహావిష్కరణకు నాందిగా జిల్లాలో ఈనెల ఐదో తేదీ శుక్రవారం కాలేజీస్థాయిలో, ఆరో తేదీ జిల్లాస్థాయిలో విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన, పెయింటింగ్, క్విజ్, తదితర అంశాలపై పోటీలను నిర్వహించాలని ఆర్ఒ, డిఇఒను కలెక్టర్ ఆదేశించారు. తప్పనిసరిగా ఈ పోటీల్లో ప్రతికళాశాల నుండి విద్యార్థులు పాల్గొనేలా శ్రద్ధ వహించాలన్నారు. ఈనెల 11వ తేదీన ఏలూరు ఇండోర్ స్టేడియంలో అంబేద్కర్ జీవిత సంగ్రామంపై ఇతర ముఖ్య ఘట్టాలపై జిల్లాస్థాయి సమావేశం, ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించాలన్నారు. అదే విధంగా అదే రోజు మానవహారం, రక్తదాన శిబిరం ఏర్పాటు చేయాలని సూచించారు. అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని డిఆర్‌డిఎ పీడీ, సోషల్ వెల్ఫేర్ జెడి, డిఐపిఆర్, డిఎంహెచ్ఒ, రెడ్ క్రాస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈనెల 18వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు ఏలూరు ఇండోర్ స్టేడియం నుంచి పాతబస్టాండ్ వరకూ మారథాన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సంబంధిత ఏర్పాట్లను డిఎస్‌డిఒ, ఏలూరు మున్సిపల్ కమిషనరు తదితర అధికారులు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో ఆయా ప్రాంతాల్లో ఉన్న అంబేద్కర్ విగ్రహాలను శుభ్రపరచి, ఏమైనా చిన్న మరమ్మత్తులు ఉంటే చేసి పెయింటింగ్ వేసే కార్యక్రమాన్ని ఈనెల 11వ తేదీలోపు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని డిపిఒ, జెడ్‌పిసిఇఒ, మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ ఆదేశించారు. ఈనెల 17వ తేదీన అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తూ ప్రతిజ్ఞ చేయాలన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటుచేసే ఫ్లెక్సీలపై సంతకాలు సేకరించాలన్నారు. జిల్లావ్యాప్తంగా జన్ భాగీదరి కార్యక్రమంపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. 19వ తేదీన అంబేద్కర్ కాంస్య విగ్రహావిష్కరణ సందర్భంగా ఆరోజు అన్ని శాఖల అధికారులు తమ సెల్ ఫోన్‌లో అంబేద్కర్ చిత్రపటాన్ని డిపిగా పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తిచేసేందుకు ప్రతిరోజూ సంబంధిత అధికారులతో పర్యవేక్షించాలని డిఆర్ఒను కలెక్టర్ అదేశించారు. జెసి బి.లావణ్యవేణి మాట్లాడుతూ జన్‌భాగీదరి కార్యక్రమాన్ని విజయవంతంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. ఆయా కార్యక్రమాల వారీగా రూపొందించి షెడ్యూల్‌ను పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, డిపిఒ తూతిక శ్రీనివాస విశ్వనాధ్, జెడ్‌పి సిఇఒ కెఎస్ఎస్.సుబ్బారావు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, డిఇఒ శ్యామ్ సుందర్, మెప్మా పీడీ ఇమ్మానియేల్, ఆర్ఐఒ కె.చంద్రశేఖర్, ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఒ డాక్టర్ నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనరు ఎస్.వెంకటకృష్ణ, డిఎస్‌డిఒ డి.శ్రీనివాసరావు, డిపిఆర్ఒ ఆర్‌విఎస్.రామచంద్రరావు, పలువురు మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఐలు కేంద్ర కమిటీ సభ్యురాలిగా ఓరుగంటి శైలజ

ప్రజాశక్తి - ఏలూరు



ఐలు కేంద్రకమిటీ సభ్యురాలిగా జిల్లాకు చెందిన ఓరుగంటి శైలజ ఎన్నికయ్యారు. గతనెల 28, 29, 30 తేదీల్లో కోల్‌కతాలో జరిగిన ఆలిండియా లాయర్స్ యూనియన్ 14వ జాతీయ మహాసభ విశేషాలను ఆమె మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 900 మంది ప్రతినిధులతో జరిగిన మహాసభలో 26 రాష్ట్రాల నుంచి 81 మంది చర్చల్లో పాల్గొని ప్రసంగించారన్నారు. ఆంధ్రాకు సంబంధించి 37 మంది పాల్గొన్నారని తెలిపారు. రాష్ట్రానికి చెందిన సుంకర రాజేంద్రప్రసాద్ అఖిల భారత వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారని తెలిపారు. తనతో పాటు రాష్ట్రానికి చెందిన ఏడుగురు కేంద్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహాసభ పలుతీర్మానాలను ఆమోదించిందన్నారు. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన క్రిమినల్ చట్ట సవరణలు రాజ్యాంగ వ్యతిరేకంగా ఉన్నాయని, వాటిని తక్షణం రద్దు చేయాలని, ఆంధ్రప్రదేశ్ లో భూహక్కుల పేర చేసిన చట్టాన్ని రద్దు చేయాలని, దేశంలో రాజ్యాంగ వ్యవస్థలను పాలక పార్టీ, కొందరి స్వార్థ ప్రయోజనాల కోసం తమ విధానాలను ప్రశ్నించే వారి మీద కేసులు, అరెస్టుల పేర దుర్వినియోగం చేయడం సరికాదని, దేశవ్యాప్తంగా కోర్టుల్లో ఖాళీ జడ్జీల, సిబ్బంది పోస్టులను భర్తీ చేసి పెండింగ్ కేసుల సత్వర విచారణకు చర్యలు తీసుకోవాలని, న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలనే తీర్మానాలను మహాసభ ఆమోదించిందని శైలజ వివరించారు.

నారాయణమూర్తికి డైరెక్టర్ వివి.వినాయక్ పరామర్శ

ప్రజాశక్తి - వీరవాసరం

ప్రముఖ వ్యాపారవేత్త ఎఎస్ఆర్ సంస్థలో ఒకరైన అడబాల నారాయణమూర్తి (బాబులు)ని స్వగ్రామం నవుడూరులో ఆయన ఇంటికి వెళ్లి సినీ దర్శకుడు వివి.వినాయక్ మంగళవారం పరామర్శించారు. ఇటీవల ఆయన సోదరుడు అడబాల సత్యనారాయణ మూర్తి గుండెపోటుతో మృతిచెందారు. ఈ నేపథ్యంలో ఎఎస్ఆర్ కుటుంబ సభ్యులతో ఉన్న సాన్నిహిత్యంతో వివి నాయక్ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వైసిపి వీరవాసరం గ్రామ అధ్యక్షుడు నూకల కనకారావు, స్థానికులు ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి వార్తకు స్పందన

భీమడోలు : పోలసానిపల్లి బీసి కాలనీలో నెలకొని ఉన్న తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని గ్రామీణ నీటి సరఫరా సంస్థ పర్యవేక్షక ఇంజనీర్ ఎవిఎస్.సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ప్రచురితమైన 'దాహార్తి తీర్చండి' అనే వార్తతో పాటు, ఇదే సమస్యపై గ్రామ సర్పంచి షేక్ రహీమా బేగం పంపిన వినతిపై ఆయన స్పందించారు. మంగళవారం తాగునీటి ఎద్దడి ఏర్పడిన ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచితో పాటు గ్రామపంచాయతీ కార్యదర్శి ఎస్.నాగూర్ సమస్య తీవ్రత, ప్రజలు పడుతున్న ఇబ్బందుల గురించి పర్యవేక్షక ఇంజనీర్ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ట్రస్ట్ పర్యవేక్షక ఇంజనీర్ తక్షణమే 24 గంటల విద్యుత్ సరఫరా కనెక్షన్లు ఇస్తామని హామీ ఇచ్చారు. గ్రామీణ నీటి సరఫరా సంస్థ పర్యవేక్షక ఇంజనీర్ జల జీవన మిషన్ నిధులతో ఆ ప్రాంతంలో నూతన పైపులైను వేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ నీటి సరఫరా సంస్థ భీమడోలు ఏఇ కె.రామారావు, టెక్నికల్ వర్క్ ఇన్స్పెక్టర్ రమేష్, ఇతర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అగ్ని బాధిత కుటుంబాలకు సాయం

ప్రజాశక్తి – ముదినేపల్లి

మండలంలోని పెయ్యేరు శివారు అప్పారావుపేటలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఆదివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన పరసా స్వరాజ్యలక్ష్మికి చెందిన తాటాకు ఇల్లు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో ఇంటిలోని గృహోపకరణాలన్నీ కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనలో బాధితురాలు సర్వం కోల్పోయి కట్టు బట్టలతో ప్రాణాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ మంగళవారం వైసిపి నాయకులతో కలిసి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందన్నారు. అగ్ని ప్రమాద బాధితురాలు పరసా స్వరాజ్యలక్ష్మికి నిత్యావసర సరుకులు, రూ.25 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు మొట్రూ ఏసుబాబు, కలిదిండి ఎంపిపి వైస్ ఛైర్మన్ ఐఖిన కిషోర్, రాష్ట్ర బిసి నాయకులు కోమటి విష్ణువర్ధన్, గ్రామ సర్పంచి అల్లు సుశీల పాల్గొన్నారు.

ముసునూరు : ప్రజా సేవకు అంకితమై, ప్రజలు బాధల్లో ఉన్నప్పుడు మేమున్నామంటూ భరోసా ఇచ్చి ఆదుకుంటున్న అట్లూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని లోపూడి గ్రామంలో కటారి నరసింహారావు కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. రెండు పూరిళ్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధం కావడంతో అట్లూరి చారిటబుల్ ట్రస్ట్ అధినేత అట్లూరి వెంకట రవీంద్ర ఆ రెండు కుటుంబాలకు రూ.5 వేల నగదు, 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు, వంట సామాగ్రి, దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మ పాము కాంతారావు పాల్గొన్నారు.

జూద క్రీడలపై కఠినచర్యలు : ఎస్ఐ

కొయ్యలగూడెం : సంక్రాంతి పండగ నేపథ్యంలో ఎవరైనా జూద క్రీడలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని కొయ్యలగూడెం ఎస్ఐ విష్ణువర్ధన్ విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలు అనేవి కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపేందుకు మంచి అవకాశం అని, దాన్ని సద్వినియోగం చేసుకుని పండగ వాతావరణాన్ని ప్రశాంత వాతావరణంలో ఉండేలా చూడాలన్నారు. కోడి పందాలు, పేకాట, గుండాట లాంటి అనేక రకాల జూద క్రీడలకు యువత మక్కువ చూపిస్తున్నారు. ఇటువంటి వారు చట్టానికి దొరికితే శిక్ష అనుభవించవలసి వస్తుందన్నారు. ఈ సంక్రాంతిని అందరూ సంతోషంగా జరుపుకోవాలని కోరారు.

మేఘలాదేవి సేవా దృక్పథం

కొయ్యలగూడెం : మండలకేంద్రంలోని చుట్టుపక్కల గ్రామాల్లో, పక్క నియోజకవర్గాల్లో మంచి పేరు వున్న వ్యక్తిగా గంగిరెడ్డి మేఘలాదేవి సుపరిచితురాలు. సేవా భావంలో పార్టీతో సంబంధం లేకుండా అందరికీ సహాయం చేసే గుణం కలవారు. తన వద్ద సహాయం పొందిన ఒక పెద్దావిడ తన కృతజ్ఞతలు చాటుకుంది. ఆమె కన్నీటి పర్యంతం అయ్యి, నిరాశ్రయ సమయంలో నన్ను ఆదుకున్నందుకు ధన్యవాదాలు తెలిపి... ఆమెకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. మేఘలాదేవి ఆప్యాయంగా పలకరించి అల్పాహారం తినిపించారు.


అల్పాహారం అందిస్తున్న మేఘలాదేవి

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

జీలుగుమిల్లి : జాతీయ పశురోగ నివారణ కార్యక్రమంలో భాగంగా పశువులకు గాలి కుంటువ్యాధి సోకకుండా మంగళవారం నుంచి వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎమ్.సాయి బుచ్చారావు తెలిపారు. 02 తారీకు నుంచి 31 తారీకు వరకు మండలం లోని అన్ని సచివాలయాల పరిధిలోని గ్రామాలలో పశు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో పశువులకు టీకాలు వేయనున్నట్టు ఆయన తెలిపారు. కావున మండలం లోని పాడి రైతులు వ్యాధి సోకకుండా పశువులకు ముందు గానే టీకాలను వేయించుకోవాల్సింది గా రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది, సచివాలయం వెటర్నరీ అసిస్టెంట్ లు పాల్గొన్నారు.

పలుచోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష–2

ప్రజాశక్తి – భీమడోలు

జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమం ద్వారా కార్పొరేట్ స్థాయి వైద్యం, ప్రత్యేక వైద్య నిపుణుల సేవలు అందుబాటులోకి వచ్చాయని భీమడోలు మండల పరిషత్ అధ్యక్షులు కనమాల రామయ్య తెలిపారు. భీమడోలు మండల స్థాయిలో ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమాన్ని ఆగడాల లంకలో మంగళవారం ప్రారంభించారు. శిబిరంలో 491 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సిహెచ్.పద్మావతి దేవి, పిహెచ్‌సి మురళీ పాల్గొన్నారు.

టి.నరసాపురం : మండలంలోని కేతవరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష ఫేస్–2 కేవరం వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్ ఆధ్వర్యంలో మంగళవారం విజయవంతంగా నిర్వహించారు. 246 మంది జగనన్న ఆరోగ్య సురక్ష సేవలను వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ మంగా కుమారి, విద్యాశాఖాధికారిణి ఎస్.కళ్యాణి, మండల వైద్యాధికారి డాక్టర్ పత్తిర్థ బాబు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సిహెచ్.రాజు, సొంగా సిద్ధూ, పంచాయతీ కార్యదర్శి కృష్ణశ్రీనివాస్, వీఆర్ఓ సీతా రామరాజు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు – ఘోరాలు

గృహిణి ఆత్మహత్య

ప్రజాశక్తి – నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలోని నెహ్రూ పేటకు చెందిన గృహిణి బాపట్ల ఉషాకిరణ్మయి(35) మంగళవారం ఉరి వేసుకొని మృతి చెందింది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలియజేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సంఘటన పట్టణంలో తీవ్రవిషాదాన్ని నింపింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కోడిపందేలపై దాడి

ప్రజాశక్తి – చింతలపూడి

చింతలపూడి మండలంలోని గణిచర్ల, సీతానగరం గ్రామాల్లో నిర్వహిస్తున్న కోడిపందేలపై దాడి చేసినట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గణిచర్ల గ్రామంలో కోడిపందేలు నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని నాలుగు కోళ్ళను, కోడికత్తి రూ.6,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సీతానగరం గ్రామంలో ఇద్దరు వ్యక్తులను అదుపులో తీసుకుని రూ.3,800 నగదు, కోడిపుంజు ఒకటి, రెండు కోడికత్తులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

ప్రజాశక్తి – జీలుగుమిల్లి

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ కె.నాగేశ్వరావు తెలిపారు. మండలంలోని తాటియాకుల గూడెం చెక్‌పోస్ట్ వద్ద మంగళవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి తన వద్ద ఉన్న సంచిలో తెలంగాణ నుంచి అక్రమంగా 6 మద్యం బాటిళ్లతో వస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీల సమ్మె ఉధృతం

నేడు కలెక్టరేట్ వద్ద మహాధర్నా - 22వ రోజు సమ్మెలో దున్నపోతులకు వినతి


జీలుగుమిల్లి : దున్నపోతుకి వినతిని ఇస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి – జీలుగుమిల్లి

అంగన్వాడీల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మె నిరంతరాయంగా కొనసాగుతూ మంగళవారానికి 22వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు దున్నపోతుకి వినతిని అందిస్తూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయపరమైన సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సమ్మె కొనసాగుతునే వుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి కొండలరావు, అంగన్వాడీ కార్యకర్తలు నాగమణి, సరళ, పూర్ణ, జ్యోతి, బేబీ పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న సమ్మె మంగళవారం 22వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఏలూరు కలెక్టరేట్ వద్ద అంగన్వాడీలు చెవిలో పువ్వులు పెట్టుకుని వినూత్నంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి



నిడమర్రు : కళ్లకు గంతలు కట్టుకుని నిరసన

వీరంకి సాయిబాబు మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోతే రానున్న కాలంలో ముఖ్యమంత్రి చెవిలో పూలు పెట్టి ఇంటికి పంపించడం ఖాయమని హెచ్చరించారు. ఎన్నికల ముందు జగన్ అంగన్వాడీ కార్యకర్తలకు తెలంగాణ కంటే అదనంగా జీతం ఇస్తానని ఇచ్చిన హామీలను ఈ ఎన్నికల ముందు అయినా పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు టి.రజిని, యూనియన్ కార్యదర్శి దుర్గాభవాని, స్వప్న, అరుణ్ కుమారి సిఐటియు ఏలూరు నగర అధ్యక్షులు బి.జగన్నాథ రావు పాల్గొన్నారు.

చింతలపూడి : రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీల సమ్మె 22వ రోజుకు చేరింది. మంగళవారం అంగన్వాడీల సమ్మెకు అమ్మిశెట్టి ఫౌండేషన్ పూర్తి మద్దతు తెలియజేశారు. ప్రభుత్వం అంగన్వాడీలు, మున్సిపాలిటీ కార్మికుల సమస్యలను పరిష్కరించి వారు చేస్తున్న సమ్మెను విరమింపచేయాలని కోరారు. వీరి సమ్మెకు మద్దతు తెలియజేసిన వారిలో ఫౌండేషన్ నాయకులు ఎ.సుబ్బారావు, కె.శ్రీను, ఎం.రామారావు, ఎం.నాగేశ్వరరావు, శ్రీను, మాధవ పాల్గొన్నారు. సిఐటియు మండల అధ్యక్షులు నత్త వెంకటేశ్వరావు, ప్రాజెక్ట్ నాయకులు మద్దతు తెలియజేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం మండలకేంద్రంలో అంగన్వాడీ నిరసనలు 22వ రోజుకు చేరుకున్నాయి. 22వ రోజు నిరసనలో భాగంగా కబడ్డీ ఆట ఆడి నిరసన తెలిపారు. అంగన్వాడీ ప్రాజెక్ట్ అధ్యక్షులు శివ రత్న కుమారి మాట్లాడుతూ బుధవారం కలెక్టరేట్ వద్ద మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు పి.పద్మజ, జె.నాగవేణి, అడపా నాగజ్యోతి, సిహెచ్.సునీతరయల్, బొబ్బిలి చిట్టి, కె.జ్యోతి, కె.మాధవి, పి.భాగ్యలక్ష్మి, ఎమ్.వెంకటలక్ష్మి, ఎమ్.మంగా, శ్రీదేవి, నుర్జాహన్ పాల్గొన్నారు.

చాట్రాయి : అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల సమస్యల పరిష్కారానికి చేస్తున్న నిరవధిక సమ్మె 22వ రోజు మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగింది. మంగళవారం అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు తమ సమస్యలు పరిష్కారం చేయాలని దున్నపోతుకు వినతిని ఇస్తూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి విజయ, ప్రమీలరాణి, మరియమ్మ, వెంకటేశ్వరమ్మ, జ్యోతి నాయకత్వం వహించగా మండల సిఐటియు నాయకుల మేడేపల్లి హెూలీ మేరీ పాల్గొన్నారు.

ముసునూరు : మండల కేంద్రమైన ముసునూరు గ్రామ సచివాలయంలో అంగన్‌వాడీల సమ్మె మంగళవారం 22వ రోజు కొనసాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దున్నపోతుకు వినతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు పల్లిపాము రాజకుమారి, మేరీ సులోచన, కలపాల విద్యావతి, లక్ష్మీ, శిరీష, విజయలక్ష్మి, వెంకటేశ్వరమ్మ, అలివేలు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ చేపట్టిన నిరసన దీక్షలు మంగళవారం నాటికి 22వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా అంగన్వాడీ నాయకురాలు శ్యామలాదేవి మాట్లాడుతూ 22 రోజులుగా ఆందోళన చేస్తుంటే సిఎం జగన్ ఉలుకు పలుకు లేకుండా ఉండటం దారుణం అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి జి.రాజు, ఎన్ఆర్.హనుమాన్లు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : అంగన్వాడీల సమ్మె మంగళవారం 22వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొరసా సతీష్ సమ్మె శిబిరానికి చేరుకుని మద్దతు తెలిపారు. ఈ సమ్మెకు సంపూర్ణ మద్దతు మా సంఘాల నుంచి ఉంటుందన్నారు. ఎపిటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మడివి శ్రీనివాసు, కరకం శ్రీనివాసు, మడివి ప్రసాద్, తాటి కన్నయ్య సంఘీభావం తెలియజేశారు. అనంతరం గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ అంగన్వాడీలు 22 రోజులుగా ధర్నా చేస్తున్న ఇప్పటివరకు కనీసం ప్రభుత్వం తమ వైఖరిని తెలియజేయకపోవడం బాధాకరమని, ఇకనైనా ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు కృపామని, నూర్జహాన్, నాగమణి పాల్గొన్నారు.

నిడమర్రు : మండలంలో అంగన్‌వాడీల సమ్మె మంగళవారం 22వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మె శిబిరాన్ని యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం బృందం చేరుకుని ఎస్‌కె.మౌలాలి ఆధ్వర్యంలో సమ్మెకు సంఘీభావం తెలియజేశారు. అంగన్వాడీ వర్కర్స్ న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం అంగన్వాడీలు కళ్లకి నల్ల రిబ్బన్ గంతలు కట్టుకుని, చెవిలో పువ్వులు పెట్టుకుని, ప్రభుత్వ కార్మిక విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిడమర్రు వీధుల్లో నిరసన ప్రదర్శన ఎన్‌టిఆర్ సెంట్రల్ వరకు జరిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ధనలక్ష్మి, ఈశ్వరి, పార్వతి, జయమ్మ పాల్గొన్నారు.

టి.నరసాపురం : అంగన్వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మెలో భాగంగా మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద


ఏలూరు అర్బన్ : చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన

అంగన్వాడీల సమ్మెకు సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు నత్తా వెంకటేశ్వరరావు, ఆర్‌విఎస్.నారాయణలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు, హెల్పర్‌లతో కలిసి ఆందోళన నిర్వహించారు.

కలిదిండి : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 22వ రోజు కొనసాగింది. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్ శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ జిల్లా ఇన్‌ఛార్జి రాజనాల రాజమోహన్, కైకలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మంగినేని బాబ్జీ, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేసిరెడ్డి వెంకట శ్రీరామకృష్ణ, మారుబోయిన శ్రీనివాసరావు శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. అంగనవాడీ సంఘం నాయకులు షేక్ అబిదా బేగం, జక్కంశెట్టి మేనక లక్ష్మి, కొప్పినీడి రమాదేవి, అంగనవాడీ టీచర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

పోలవరం : మండలంలో అంగనవాడీల నిరవధిక సమ్మె 22వ రోజు చేరుకున్న సందర్భంగా మంగళవారం పంచాయతీ కార్యాలయం ఎదుట అంగన్వాడీల సమ్మెలో పోలవరం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాసులు, మండల కన్వీనర్ బొద్దుకృష్ణ, పాపోలు గణపతి రత్తయ్య టిడిపి నాయకులు పూర్తి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పిఎల్ఎస్ కుమారి, అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్, టిడిపి నాయకులు సమ్మెలో పాల్గొన్నారు.

ముదినేపల్లి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం 22వ రోజు సమ్మెలో భాగంగా దున్నపోతుకు వినతి పత్రాన్ని అందజేశారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఐసిడిఎస్‌ను బలోపేతం చేయాలని, తదితర డిమాండ్లను పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.


చికిత్స పొందుతున్న రాంబాబు

అస్వస్థతకు సిఐటియు జిల్లా నాయకులు

కొయ్యలగూడెం : సమ్మె శిబిరం వద్ద సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు అస్వస్తకు గురయ్యారు. అంగన్వాడీ నిరసనలు 22వ రోజుకు చేరుకున్నాయి. 22 రోజుల నుంచి నిరసన దీక్షలో అవిరామంగా పాల్గొనడంతో ఆరోగ్యం క్షీణించింది. హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది.

సమ్మె శిబిరంలో పాము కలకలం

మండవల్లి : అంగన్వాడీ శిబిరంలో పాము చేరి కలకలం సృష్టించింది. దీంతో అంగన్వాడీలు ప్రాణభయంతో కేకలు వేస్తూ పరుగులు తీశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు నిర్వహిస్తున్న ధర్నా మంగళవారం కొనసాగాయి. 22వ రోజు సమ్మెలో సిఐటియు నాయకులు డిఎన్‌విడి ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం పాము చేరడంతో శిబిరంలో కలకలం రేగింది. ధైర్యం చేసి పక్కనే ఉన్న కర్ర పుల్లల సహాయంతో దానిని కొట్టి చంపేశారు. దీంతో అంగన్వాడీలు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు మాట్లాడుతూ ప్రాణాలు పోయే పరిస్థితులు నెలకొన్న ధర్నా విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు వాణి చెల్లమ్మ, విజయలక్ష్మి, ఉమాదేవి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

నిత్యం వ్యాయామం చేయాలి

ప్రజాశక్తి – ముసునూరు

ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు ప్రతిరోజు వ్యాయామం చేసినట్లయితే ఆరోగ్యకరంగా ఉంటారని ఫిజియోథెరపిస్టు జి.ప్రశాంతి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రమణక్కపేట హైస్కూల్‌లో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డిఎంవి.లక్ష్మీనారాయణ, జై.నాగమల్లేశ్వరి, బి.సురేష్ బాబు, లోకరాజు మాస్టర్ పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణకు అవకాశం

ప్రజాశక్తి – నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం అఖిలపక్ష నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ మాట్లాడుతూ వాటర్ లిస్టు ముద్రించేందుకు మరికొంత సమయం ఉందని, చేర్పులు, మార్పులపై సలహాలు, సూచనలు అందించవలసిందిగా కోరారు. ఓటర్ లిస్ట్ వెరిఫికేషన్‌లో అన్ని రాజకీయ పార్టీలు తమ సిబ్బందికి సహకరించవలసిందిగా కోరారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి – బుట్టాయగూడెం

మండలంలోని కంద్రిక గూడెంలో సీసీ రోడ్లను, తదుపరి అచ్చియ్య పాలెంలో రూ.42 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.20 లక్షలతో నిర్మించిన హెల్త్ క్లినిక్‌లను తదుపరి నూతి రామన్న పాలెంలో సీసీ డ్రెయిను, గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రంను, తదుపరి నిమ్మలగూడెం గ్రామంలో సీసీ రోడ్లను ఎంఎల్ఎ బాలరాజు, ఐటిడిఎ పిఒ సూర్యతేజ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, ఎంపిడిఓ వేణుగోపాల్ రెడ్డి, తహశీల్దార్ ఎస్–ఎస్.శాంతి, ఎంపిపి కారం శాంతి, వైస్ ఎంపిపిలు కుక్కల వరలక్ష్మి పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాల అమల్లో ఆశాల పాత్ర కీలకం

ఏలూరు టౌన్ : అనేక జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులోను, అంటువ్యాధుల నిర్మూలనలోనూ ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాత్ర చాలా కీలకమని, సమన్వయంతో పని చేసి మంచి ఫలితాలు సాధించాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. ఆశా డే సందర్భంగా స్థానిక ఏలూరు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలైన పవర్‌పేట, తాంగేళ్లమూడిలో ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ అనేక జాతీయ కార్యక్రమాలైన తల్లీ బిడ్డ సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలోనూ దోమల ద్వారా వచ్చే వ్యాధులైన డెంగీ, మలేరియా నిర్మూలన కార్యక్రమంలోనూ ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. కోవిడ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ గౌతమ్, హెల్త్ సూపర్వైజర్స్ జాన్సీ, శ్రీనివాసులు, అసిస్టెంట్ మేక శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలి

చింతలపూడి : ఎపి ల్యాండ్ టైటిలింగ్ 27/2023 యాక్ట్‌ను రద్దు చేయాలని చింతలపూడి బార్ అసోసియేషన్ అధ్యక్షులు కాకర్ల మాణిక్యాలరావు బి.నాగేశ్వరావు డిమాండ్ చేశారు. చింతలపూడి పట్టణంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వద్ద మంగళవారం లాయర్లు నిరసన దీక్ష శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 27/2023 పేద ప్రజలకు నిరుపయోగంగా మారుతుందని రాజకీయ నాయకులు, భూస్వాములకు అనువుగా ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో లాయర్లు జి.భాస్కరరావు, కె.సూరయ్య, ఎస్.రమాదేవి, జి.శ్రీనివాస్ రెడ్డి, కె.దుర్గా భవాని పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : పట్టణంలోని ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్–2024 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు మంగళవారం ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది వైఎస్ దొరై మాట్లాడుతూ పేదల భూహక్కులను హరించే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అనే నల్ల చట్టం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భారత అధ్యక్షులు సత్య ప్రకాష్, రవి మధు శంకర్, ఎం.నరసింహారావు పాల్గొన్నారు.

పేదలకు రగ్గులు పంపిణీ

పోలవరం : చలికాలం, శీతల గాలుల నుంచి రక్షణ కోసం పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రం సూపరిండెంట్ ఎంవి.సతీష్ బాబు మంగళవారం పలువురు పేదలకు రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సతీష్ బాబు మాట్లాడుతూ తనతో పాటు వైద్య వృత్తిలో ఉన్న కొందరు వచ్చే ఆదాయంలో రెండు నుంచి ఐదు శాతం స్వచ్ఛంద సేవ కోసం కేటాయించాలని నిర్ణయించుకోవడం జరిగిందన్నారు. ఆ నిర్ణయం మేరకు సొంత ఖర్చులతో కొని పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి గెడ్డం జ్యోతి, రాంబాబు పాల్గొన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయాలి

కలిదిండి : ఈనెల 3, 4 తేదీల్లో అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికై విజయవాడ గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో జరిగే నిరాహార దీక్షకు అగ్రిగోల్డ్ బాధితులు తరలి రావాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కైకలూరు శాఖా అధ్యక్షులు చక్కా జగన్మోహనరావు అన్నారు. మరణించిన అగ్రిగోల్డ్ బాధిత కుటుంబ సభ్యులతో రెండు రోజుల పాటు జరిగే దీక్షలో బాధితులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

యువతలో క్రీడాస్ఫూర్తికే 'ఆడుదాం ఆంధ్రా'

ప్రజాశక్తి – భీమడోలు

ఆడుదాం ఆంధ్రాతో యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందుతుందని ఏలూరు ఆర్‌డిఓ ఖాజావలీ కోరారు. భీమడోలు హైస్కూల్లో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు తహశీల్దార్ ఎం.ఇందిరాగాంధీ పాల్గొన్నారు.

పోలవరం : పాత పట్టిసీమ పంచాయతీ పరిధిలో మంగళవారం సర్పంచి సబ్బరపు శ్రీరామ్ మూర్తి ఆధ్వర్యంలో ఆడదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా వాలీబాల్ పోటీలు నిర్వహించినట్లు సెక్రటరీ ఎల్‌వివిఎస్ఎన్.మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాత పట్టిసీమ సర్పంచి సబ్బరపు శ్రీరామ్ మూర్తి, సొసైటీ అధ్యక్షులు పాదం రాజబాబు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు టిడిపి అండ : బొరగం

టి.నరసాపురం : కార్యకర్తలకు టిడిపి ఎల్లప్పుడూ అండగా వుంటుందని పోలవరం నియోజకవర్గం కన్వీనర్ బొరగం శ్రీనివాసులు అన్నారు. మండలంలోని అప్పలరాజుగూడెం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త కలపాల నాగరాజు ఇటీవల మేజర్ యాక్సిడెంట్‌కు గురికావడంతో మంగళవారం ఆయన స్వగృహానికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత పోలవరం నియోజకవర్గం అధ్యక్షులు గన్నిన సురేంద్రనాథ్ చౌదరి, వెలిశెట్టి కాశీ, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో అన్న సమారాధన

పోలవరం : పోలవరం మండలం గూటాల గ్రామంలో గోదావరి నది తీరాన కొలువై ఉన్న భక్తాంజనేయ స్వామి ఆలయం వద్ద మంగళవారం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ ప్రెసిడెంట్ కరిబండి రాంబాబు పాల్గొన్నారు.

162 మందికి కొత్త పింఛన్లు

కలిదిండి : స్థానిక గ్రామ సచివాలయం వద్ద 162 మంది నూతన పెన్షన్ల లబ్ధిదారులకు పెంచిన మొత్తంతో కలిపి రూ.3వేలు చొప్పున కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు పంపిణీ చేశారు. పెంచిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, జెడ్‌పిటిసి బొర్రా సత్యవతి పాల్గొన్నారు.